
# అన్ని హక్కులను కాలరాస్తున్నారు

# సంఘటితమై పోరాడదాం రండి...



మిత్రులారా !

దేశంలో రాజ్యమేలుతున్న ఫాసిస్ట్ హిందుత్వవాదుల సంస్కృతి ఒక్క ప్రజాస్వామిక విలువలనే కాదు ప్రజా జీవనంలో కొద్దో గొప్పో మిగిలి ఉన్న మర్యాద, సభ్యతలను కూడా ధ్వంసం చేస్తోంది. అసత్యాలను నమ్మబలికే వితండవాదం రాజ్యమేలుతోంది. భిన్నత్వం మాట అటుంచండి సున్నితమైన భావాలకు, మాటలకు, చేతలకు సైతం సమాజంలో చోటు లేకుండా పోయింది. టీవీ చానల్స్, సోషల్ మీడియా ట్రోల్స్ అధికార ఫాసిస్ట్ రాజకీయాలకు వేదికలయ్యాయి. ఒకవైపు హిందుత్వవాదుల అండతో కొందరు గోరక్షకుల అవతారం ఎత్తి బహిరంగంగా హత్యలకు పాల్పడుతుంటే, కతువా, ఉన్నావ్ వంటి అనేక చోట్ల ముక్కుపచ్చలారని ఆడపిల్లలపై అత్యాచారాలు విపరీతంగా పెరుగుతున్నాయి. మూకోన్మాదానికి ఇప్పటికే గత నాలుగేళ్ళలో 80 మందికి పైగా బలయ్యారు. నిందితులను మంత్రులే వెనకేసుకు వచ్చి విమర్శకుల నోళ్ళు నొక్కాలని చూస్తున్నారు. మంత్రులు నిందితులుగాను, నిందితులు మంత్రులుగాను మారిపోతున్న సందర్భంలో జీవిస్తున్నాం మనం. క్రమంగా 'చట్టబద్ధ పాలన' అనే విలువ స్థానంలో ఒక వైపు మనువు, కౌటిల్యుడి నాటి భావనలు, మరో వైపు నాజీల ఆలోచన విధానం తిష్ట వేసుకు కూర్చున్నాయి. ఒకప్పుడు మనం అర్ధ వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థలో బ్రతుకుతున్నాం అనేవారు. ఇప్పుడు మటుకు మనం కచ్చితంగా అర్ధ మనువు, అర్ధ ఫాసిస్ట్ వ్యవస్థలో బ్రతుకుతున్నామని చెప్పాలి.

ప్రజాస్వామిక విలువలు అడుగంటిపోతే దాని పర్యవసానం అందరం అనుభవిస్తాం కాని ఈ రాజకీయ ప్రయోగం వికృత క్రీనీడలో ఎక్కువ నష్టపోయేది బడుగు జీవులైన స్త్రీలు, పేదలు, ఆదివాసులు, దళితులు, మైనారిటీలు, ఇతర అణగారిన వర్గాలవారు. అది వారి మనుగడకే ముప్పు. కరువు, నిరుద్యోగం, పెరుగుతున్న ధరలతో సతమతమవుతున్న ప్రజలకు ఊరట కలిగించే ఆర్థిక విధానాలను రూపొందించే ఉద్దేశం ప్రస్తుత పాలకులకు ఎంతమాత్రం లేదు. ఉన్నదల్లా తూత్తుకుడిలో ప్రజలపై కాల్పులకు కారణమైన స్టెరిలైట్ కంపెనీ యజమాని అనిల్ అగర్వాల్ వంటి పారిశ్రామికవేత్తలను కాపాడటం, బ్యాంకులను లూటీ చేసిన విజయ్ మాల్యా, లలిత్ మోడీ, నీరవ్ మోడీలను విదేశాలకు తప్పించడం, రాఫెల్ యుద్ధవిమానాల వంటి ఒప్పందాల ద్వారా అంబానీలకు, అదానీలకు ప్రయోజనం చేకూర్చడం, పెద్ద నోట్లను రద్దు చేసి నల్ల డబ్బును ప్రక్షాళన చేసినట్టు భ్రమలు కల్పించడం, కాషాయం ముసుగులో కార్పొరేట్ నేరాలను ప్రోత్సహించడం వంటి పనులు మాత్రమే. ఇవే వారు ఇప్పటిదాకా చేసిన ఆర్థిక ప్రయోగాలు. గోరక్షణ, లవ్ జిహాద్ పేరు మీద దళితులను, మైనారిటీలను చంపే ఘటనలు ఎంతగా పెరిగాయంటే ఈ ఆర్థిక నేరాల మీద మనం పెట్టాల్సినంత దృష్టి పెట్టలేనంతగా. అదే వారి ఉద్దేశం కూడానేమో! నిజానికి ఈ రెండూ తప్ప వేరే ఎజెండా ఏదీ లేదు వారి దగ్గర.

తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికి ప్రజలలో ఒక వర్గంపై దాడి చేసేటప్పుడు వేరే వర్గాన్ని కలుపుకోవడం, ఆ వర్గంపై దాడి చేసేటప్పుడు మరొక వర్గాన్ని కలుపుకుని పబ్బం గడుపుకోవడం – ఈ విధంగా సామాజిక నిర్మాణాన్ని ఛిన్నాభిన్నం చేయడంలో అధికార పక్షాలు గత 72 సంవత్సరాల్లో గొప్ప ప్రావీణ్యతను సాధించాయి. నాలుగేళ్ల పాలనలో ఈ విషయంలో బి.జె.పి. అందరినీ మించిపోయింది. అణగారిన వర్గాలు ఎక్కడ ఏకమవుతాయోనని భీమా కొరెగావ్ అల్లర్లను మావోయిస్టులకూ, ప్రధాని హత్యా ప్రయత్నం కుట్రకూ ముడిపెట్టి పొంతన లేని కట్టుకథలు అల్లుతున్నారు.  జరుగుతున్న సంఘటనలు, వాటి గురించి జరుగుతున్న ప్రచారం, ఆ ప్రచారం మాటున దాగిన సత్యాసత్యాలను ప్రజలు అర్థం చేసుకునే ప్రయత్నం చేయకపోతే, వాటి పట్ల తమ అభిప్రాయాలు వ్యక్తం చేయకపోతే శరవేగంగా వచ్చి పడుతున్న ఈ పరిణామాలకు అడ్డుకట్ట వేయలేము. ఈ విషయం మనం ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది. ఈ శక్తులే మరోసారి కేంద్రంలోకి అధికారంలోకి వస్తే 2019  ఎన్నికలు దేశంలో ఆఖరి ఎన్నికలు అయ్యే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి భయాలను మీరు పంచుకోకపోయినా వారి ఆందోళనకు గల కారణాల గురించి ఆలోచించమని కోరుతున్నాం. మతం పేరుతో బి.జె.పి. ఈ దేశాన్ని ఒక ప్రయోగశాలగా మార్చడంపై ప్రతిపక్షాలు ఎందుకు మాట్లాడడం లేదు? ఆ రాజకీయాలతో వారికి ఎటువంటి పేచీ లేదని అనుకుందామా? మన రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు వీటి గురించి మౌనంగా ఉండడం సిగ్గుచేటు.

చట్ట ప్రకారం పరిపాలించాల్సిన అధికారులలో ఆ స్పృహ పూర్తిగా లోపించడం మరో ఆందోళన కలిగించే అంశం. పోలీసులు అవసరమైన దగ్గర నిస్సహాయులుగా నటిస్తూ, అవసరం లేని దగ్గర మితి మీరిన అధికార దర్పాన్ని ప్రదర్శిస్తున్నారు. దర్యాప్తు బృందాలు వాస్తవాలు

## కార్యక్రమం

**అక్టోబర్ 7 2018 సుందరయ్య విజ్ఞాన కేంద్రం, సమయం : ఉ॥ గం॥ల 10:00 నుండి సా॥ 5:00 వరకు**

| | | |
|---|---|---|
| **అసమ్మతి నోరు నొక్కుతున్న హిందుత్వం** | : | **కాలిన్ గొంజాల్వేస్,** సుప్రీంకోర్టు న్యాయవాది |
| **ప్రకృతి - మానవహక్కులు** | : | **సత్యసాగర్,** పబ్లిక్ హెల్త్ యాక్టివిస్ట్ |
| **ప్రజాస్వామ్యానికి మీడియా ముప్పుగా మారిన వేళ** | : | **హర్‌తోష్ సింగ్ బల్,** పొలిటికల్ ఎడిటర్, కారవాన్ పత్రిక |
| **లైంగికత్వం - హక్కులు - హింస** | : | **ఎ. సునీత,** జెండర్ స్టడీస్ పరిశోధకురాలు |

సేకరించే పని మానుకుని, కట్టుకథలు అల్లి మీడియా మిత్రులకు అందజేయడంలో తలమునకలై ఉన్నాయి. ఒక కొత్త క్రిమినల్ న్యాయ వ్యవస్థలో బ్రతుకుతున్నాం. ఇక్కడ రాజకీయ ప్రత్యర్థులకు చోటు లేదు. పోలీసుల నుండి, వారి అక్రమ సోదాలు, స్వాధీనాల నుండి మన మొబైల్ ఫోన్లను, కంప్యూటర్లను, హార్డ్ డిస్క్‌లను, పెన్‌డ్రైవ్‌లను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. లేదంటే ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబా లాగా ఏళ్ళ తరబడి జైళ్లలో మగ్గే రోజులు దాపురించాయి. ఏ ఆధునిక పరికరంలో ఏమి చొప్పించి నువ్వు అర్బన్ నక్సలైటువని అంటే, అది ఆ నోటా ఈ నోటా టీవీ చానల్స్ నోట పడితే – ఇంకేముంది అది 'నిజమై' కూర్చుంటుంది. రాత్రికి రాత్రే మనం నిషిద్ధ సంస్థ సభ్యులమైపోయి, వారికి ఆర్థిక వనరులు సమకూర్చేవారం అయిపోయే ప్రమాదముంది. ప్రజలు అసత్యాలను, అప్రజాస్వామిక చర్యలను, నిర్బంధాన్ని ఎంతవరకు భరించగలరో ఎల్లప్పుడూ పరీక్షకు గురి చేయడమే ఫాసిజం లక్షణం.

ప్రజల రాజకీయ, ఆర్థిక జీవితమే కాదు, సామాజిక, ప్రాకృతిక జీవితం సైతం సంక్షోభంలో కూరుకుపోతోంది. మిర్యాలగూడలో తన కుమార్తె అమృత ఒక దళిత యువకుణ్ణి పెళ్ళి చేసుకోవడాన్ని సహించలేని ఆమె తండ్రి అమృత భర్త ప్రణయ్‌ను హత్య చేయించాడు. దళిత యువకుడ్ని పెళ్లి చేసుకుందన్న కోపంతో హైదరాబాద్‌లో మరో తండ్రి కూతుర్నే చంపినంత పని చేశాడు. ఎటువంటి కులోన్మాదం ఇది? 40, 50 ఏళ్ళుగా కులాంతర వివాహాలు జరుగుతున్నా ఇంతటి వైపరీత్యం ఎప్పుడూ లేదు. పాఠాలు చెప్పే అధ్యాపకుడే తనపై లైంగిక అత్యాచారానికి పాల్పడ్డాడని తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్ శిల్ప రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఆమెకు ఆత్మహత్య తప్ప మరో దారి ఎవరూ చూపించలేకపోయారు. అంత దౌర్భాగ్య స్థితిలో మనమున్నాం. సాక్షాత్తూ విశ్వవిద్యాలయాలే స్త్రీలపై లైంగిక దాడులకు వేదికలు అవుతున్నాయి. ఇటువంటి వేధింపులకు గురవుతున్న పలువురు స్త్రీలు ఇటీవల 'మీ టూ' కాంపెయిన్ నిర్వహించి వీటిపై బహిరంగ చర్చను లేవనెత్తారు. ఇతరత్రా సమాజంలో గొప్ప మేధావులుగా చెలామణి అయ్యేవారి మాటల్లో, చేతల్లో, జీవితాల్లో ఎంత డొల్లతనం ఉందో ఎత్తి చూపించారు.

వీటిని ఒక రోజు కాకపోతే ఒకరోజు సరిదిద్దుకోగలమేమో గాని జరుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని అడ్డుకోకపోతే మనకు మనుగడ లేదు. సహజమైన జీవనశైలికి దూరమై మానవాళి ఎక్కడో గాడి తప్పినట్లు స్పష్టమవుతోంది. తనకి తానూ పరాయి అవుతున్నది, ప్రకృతికీ పరాయి అవుతున్నది. తెలిసో తెలియకో తన చుట్టూ తాను ఏర్పరచుకున్న ఒక కృత్రిమ ప్రపంచంలో చిక్కుకుని వివేచన కోల్పోతున్నది. ప్రకృతిపై సవాళ్ళు విసురుతూ ఏ మనుగడ కోసం ప్రయాణం మొదలుపెట్టిందో ఆ మనుగడకే ముప్పు తెచ్చుకుంటోంది.

✦ ✦ ✦

**1998** అక్టోబర్‌లో మానవహక్కుల వేదిక ప్రారంభమయింది. ఈ ఇరవై ఏళ్ల ప్రస్థానంలో ఒక స్వతంత్ర హక్కుల సంస్థగా ఇటువంటి అనేక విషయాలపై తన గొంతును వినిపిస్తూ వస్తోంది. హక్కుల హననానికి వ్యతిరేకంగా శక్తి మేరకు పోరాడుతూ వుంది. వేదిక వ్యవస్థాపక నాయకులు బాలగోపాల్‌గారు మనలను వీడి తొమ్మిదేళ్ళు గడిచిపోయాయి. లౌకిక, ప్రజాస్వామ్య విలువలు ప్రమాదంలో పడుతున్న విషయాన్ని ఎంతో ముందుగానే పసిగట్టి హెచ్చరికలు చేసిన కొద్దిమందిలో బాలగోపాల్‌గారు ఒకరన్న సంగతి మనందరికీ తెలుసు. ఈ పదేళ్ళ కాలంలో పరిస్థితి మరింత విషమించి, సామాజిక సంక్షోభం ఇంకా తీవ్రమైంది. బాలగోపాల్‌గారి 9వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నలుగురు వక్తలు సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్న ఈ పరిణామాలపై మాట్లాడతారు. ప్రజాస్వామ్య హక్కుల్నీ, విలువల్నీ కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదీ. అందరూ వచ్చి విని, ఈ పరిస్థితులను మార్చడానికి ఏమి చేయాలో ఆలోచించాలని కోరుతున్నాం.

30 సెప్టెంబర్ 2018

**మానవహక్కుల వేదిక**

Human Rights Forum (HRF)

ప్రచురణ : జి. మోహన్, 9440102129; కె. సుధ, 9492535618 ముద్రణ : అనుపమ ప్రింటర్స్, శాంతినగర్, హైదరాబాద్. 040–23391364